బిజెపిని బొంద పెట్టాలి..

- మళ్లీ గెలిస్తే దేశం సర్వనాశనం
- ప్రజాసమస్యలపై పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ మళ్లీ గెలిస్తే దేశం సర్వనాశనం అవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గసిపిఎం అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణ పురం మండలం పుట్టపాక గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు బిజెపి పాలనలో దేశం రావణకాష్టంలా మండిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తోందన్నారు. పొరపాటున కూడా బిజెపిని మళ్లీ అధికారంలోకి రానివ్వొద్దని, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న ఆ పార్టీని ఈ ఎన్నికల్లో బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ఎర్రజెండా పార్టీలు దేశవ్యాప్తంగా 28 పార్టీలతో కలిసి ఇండియా కూటమిగా ఏర్పడినట్టు చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చాక 20 కోట్ల ఉద్యోగాలు ఊడిపోయాయన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించారు. రైతుల ఆదాయం పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపిని గిట్టుబాటు ధర అడిగినందుకు 765 మంది రైతులని కాల్చి చంపిందన్నారు. వారి ఆగడాలను ప్రశ్నించినందుకు ప్రతిపక్ష నాయకులను జైళ్లకు పంపిస్తున్నారన్నారు. పేదల సంక్షేమాన్ని మరిచి అదానీ అంబానీలకు లక్షల కోట్లు దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులంతా రాజకీయాల్లోకి వచ్చి భ్రష్టు పట్టిస్తున్నారన్నారు.

భువనగిరి ఖిల్లాలో ఎర్రదండు

- సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజల్లోకి..
- ఉద్యమ ఫలితాలతో.. పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎం
- భువనగిరి పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌కు అన్ని వర్గాల మద్దతు

ప్రచారంలో సిపిఎం నాయకులుల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విప్లవ పోరాటాలు, ప్రజా ఉద్యమాలకు కేంద్రమైన భువనగిరి ఖిల్లాలో ఎర్రజెండా గెలుపు కోసం కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఖిల్లా గడ్డపై ఎర్రదండు కదం తొక్కుతోంది. సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ ప్రచారం సాగుతోంది. ప్రజా ఉద్యమాల ద్వారా సాధించిన ఫలితాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రజా సమస్యలపై నిర్దిష్టమైన ప్రణాళికలతో సిపిఎం ప్రచారం నిర్వహిస్తోంది. ప్రజల నుంచి పార్టీ అభ్యర్థి జహంగీర్‌కు అపూర్వ ఆదరణ వస్తోంది. మిగతా పార్టీల్లోనూ చర్చనీయాంశమవుతోంది.

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కమ్యూనిస్టుల పోరాట చరిత్ర కలిగినవే. నాటి సాయుధ రైతాంగ పోరాటం మొదలు నేటి మూసీ ప్రక్షాళన ఉద్యమాల వరకు ఎన్నో ప్రజా ఉద్యమాలను నడిపిన ఘనత కమ్యూనిస్టులకు దక్కుతుంది. పార్లమెంట్ పరిధిలో భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం ఒకప్పుడు కమ్యూనిస్టు ఉద్యమాలకు కంచుకోటలు. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమ్యూనిస్టు నాయకులు ప్రజాప్రతినిధులుగానూ ప్రాతినిధ్యం వహించారు. భువనగిరిలో రావినారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, తుంగతుర్తిలో బిఎన్‌రెడ్డి, మల్లు స్వరాజ్యం, నకిరేకల్‌లో ధర్మభిక్షం, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, అత్యధిక కాలం నర్రా రాఘవరెడ్డి, ఆలేరులో ఆరుట్ల కమలాదేవి, జనగామలో ఎసి రెడ్డి నర్సింహారెడ్డి ప్రాతినిధ్యం వహించారు. వారు ప్రాతినిధ్యం వహించిన సమయంలో చేసిన అభివృద్ధి నేటికీ పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, భూమి లేని వ్యవసాయ కార్మికులకు భూ పంపిణీ కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోయాయి. భువనగిరి పార్లమెంట్ పరిధిలో కమ్యూనిస్టుల ప్రాబల్యంతో అత్యధికంగా పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేశారు. ఇప్పటికీ ఆ కుటుంబాలు ఎర్రజెండా అభిమానులు గానే.. ఎర్రజెండాకు అండగా నిలబడుతున్నారు.

ప్రజా ఉద్యమాల ఫలితాలతో ప్రజల్లోకి..

గత ఉద్యమాల ఫలితాలను, సమస్యలను ప్రజలకు వివరిస్తూ సిపిఎం కార్యకర్తలు ప్రచారం సాగిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రజల కోసం చేపట్టబోయే పోరాటాలను ప్రజలకు చెబుతూ వారి మద్దతును కూడగడుతున్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అత్యధిక గ్రామాల నుంచి ప్రవహిస్తున్న 'మూసీ' ప్రక్షాళన కోసం ఇటీవల సిపిఎం అధ్వర్యంలో ఎంపి అభ్యర్థి జహంగీర్ నేతృత్వంలో ఉద్యమాన్ని చేపట్టారు. ఈ ఉద్యమం ఫలితంగా రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతుల నుంచి సిపిఎంకు మంచి ఆదరణ లభిస్తోంది.

కమ్యూనిస్టుల ఫలితమే.. సాగు నీటి ప్రాజెక్టులు

భువనగిరి, నకిరేకల్ ప్రాంతాల్లో సాగు నీటి కోసం ఎన్నో ఏళ్లుగా సతమతమవుతున్న రైతుల పక్షాన సిపిఎం చేపట్టిన ఉద్యమాల ఫలితంగా ఈ ప్రాంతంలో రెండు సాగు నీటి అవసరాల కోసం ధర్మారెడ్డి పల్లి, పిల్లాయిపల్లి కాలువలను ప్రభుత్వాలు ప్రారంభించాయి. దాంతో వేలాది మంది రైతులకు లబ్ది చేకూరుతున్నది. ఇలా అనేక ఉద్యమాల ఫలితంగా ప్రజా సమస్యలు పరిష్కరించిన చరిత్ర గల కమ్యూనిస్టులకు అవకాశం ఇస్తే ఉద్యమాలకు మద్దతు ఇచ్చిన వారవుతారని చ్పెడం ప్రజలను ఆలోచింపజేస్తోంది. ఈ ప్రాంత చరిత్రను మరొక్క సారి గుర్తు చేసుకుంటూ ఓటర్లు సిపిఎం అభ్యర్థిని ఆదరిస్తున్నారు. ఘనస్వాగతం పలుకుతున్నారు.

ఇంటర్ విద్యలో అక్రమార్కులకు పెద్దపీట

- నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు, ఓడీలు
- స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్‌ను విడుదల చేయాలి
- చర్యలు తీసుకోకుంటే మెరుపు ఉద్యమం
- టిప్స్, టిగ్లా హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యలో గందరగోళం నెలకొందని, అక్రమార్కులకు పెద్దపీట వేస్తున్నారని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్), తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్ల అసోసియేషన్ (టిగ్లా) విమర్శించాయి. బోర్డులో నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు, ఓడీలు ఇస్తున్నారని తెలిపాయి. ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల విధులు, స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉద్యోగులకు రెమ్యునరేషన్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశాయి. ఈ అంశాలపై చర్యలు తీసుకోకుంటే మెరుపు ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించాయి. ఈ మేరకు టిగ్లా అధ్యక్షులు, టిప్స్ సమన్వయకర్త మైలారం జంగయ్య, టిప్స్ రాష్ట్ర కన్వీనర్, టిగ్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవినీతి, అక్రమార్కులపై ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఈ సందర్భంగా తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ బోర్డులో డిప్యుటేషన్లు, ఓడీలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, వార్షిక పరీక్షలు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో జరిగాయని, ఆ తర్వాత స్పాట్ వాల్యుయేషన్ చేపట్టారని గుర్తు చేశారు. ఆ ఉద్యోగులకు ఇంకా రెమ్యునరేషన్ చెల్లించకపోవడం దారుణమని విమర్శించారు. ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా సానుకూలంగా స్పందించడం లేదని, ఏదో సాకు చూపుతూ దాటవేత ధోరణితో అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ వైఖరి మార్చుకోకుంటే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం తప్పదని హెచ్చరించారు. అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న డిడి ఎం లక్ష్మారెడ్డిపై తదుపరి క్రమశిక్షణ చర్యలు, ఖమ్మం డిఐఇఒ అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశించినా, నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ, ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా 13 ఏండ్లుగా డిప్యూటేషన్, ఓడీగా పనిచేస్తున్న వై శ్రీనివాస్‌ను జాయింట్ సెక్రెటరీగా కొనసాగించడం, ఎనిమిదేళ్లుగా వనపర్తి డీవీఈఓ దీపిక డిప్యూటీ సెక్రెటరీ డిప్యుటేషన్, ఓడీగా కొనసాగుతుండడం గందరగోళానికి గురిచేస్తున్నదని తెలిపారు. అనేక అక్రమాలకు పాల్పడిన ఖమ్మం జిల్లా నయాబజార్ కాలేజీ ప్రిన్సిపల్ కె రామారావును గద్వాల్ జిల్లా గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ చేసినప్పటికీ ఏడు నెలలుగా అతను ఆ కాలేజీలో చేరలేదని పేర్కొన్నారు.

నేటినుంచి మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు 25 తుదిగడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మాధ్యమంలో ఉచిత విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి కోర్సుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఉంటాయని వివరించారు. మొదటి విడత ప్రవేశాలకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఈ నెల 25వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. పూర్తి షెడ్యూల్‌తోపాటు సమాచారం కోసం www.tsmodelschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటితో ముగియనున్న ఎప్‌సెట్ పరీక్షలు

- రెండోరోజు ఉదయం 94.3 శాతం, మధ్యాహ్నం 94.8 శాతం హాజరు
- రేపు ఇంజినీరింగ్ విభాగం ప్రాథమిక కీ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు జరుగుతున్నాయి. శనివారంతో ఎప్‌సెట్ రాతపరీక్షలు ముగుస్తాయి. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రెండోరోజు ఉదయం విడతకు 50,990 మంది దరఖాస్తు చేయగా, 48,097 (94.3 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 2,893 (5.7 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని వివరించారు. మధ్యాహ్నం విడతకు 50,987 మంది దరఖాస్తు చేస్తే, 48,318 (94.8 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. 2,669 (5.2 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. శుక్రవారం ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ ఆర్ లింబాద్రి, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జెఎన్‌టియు హైదరాబాద్ విసి కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షించారని పేర్కొన్నారు. రెండోరోజు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వెల్లడించారు. ఆదివారం ఇంజినీరింగ్ విభాగం ప్రాథమిక కీని విడుదల చేస్తామని తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 14వ తేదీ ఉదయం పది గంటల వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసంఅభ్యర్థులుhttps://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మళ్లీ బిజెపి వస్తే వందేళ్లు వెనక్కు

- రిజర్వేషన్లు రద్దవుతాయి
- నగరంలో మతకల్లోలాలు సృష్టించేందుకు బిజెపి యత్నం
- హైదరాబాద్‌కు వచ్చే పెట్టుబడులు గుజరాత్‌కు తరలింపు
- కారు షెడ్‌కి పోలే.. తూకానికి పోయింది
- జెపి దర్గా సాక్షిగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతాం..
- పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- మక్తల్, షాద్‌నగర్, గోషామహల్ సభల్లో సిఎం రేవంత్

ప్రచారంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బిజెపి మళ్లీ గెలిస్తే రిజర్వేషన్‌లు ఉండవు. మరో వందేండ్లు వెనక్కు పోతాం. దేశంలో పెట్టుబడులు రావు.. అభివృద్ధి ఉండదు. హైదరాబాద్‌కు వచ్చే పెట్టుబడులు గుజరాత్‌కు తరలించుకుపోవాలనే కుట్ర జరుగుతుంది. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టడమే వారి పని. బిజెపి, బిఆర్ఎస్ రెండూ ఒకటే' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. షెడ్డుకు పోయిన కారు ఇక తిరిగి రాదని వ్యాఖ్యానించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మక్తల్, షాద్‌నగర్, హైదరాబాద్‌లోని గోషామహల్ ప్రాంతాల్లో జరిగిన సభల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో అరుణమ్మ గెలిస్తే మళ్లీ మాఫియా రాజ్యం వస్తుందని, ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే వంశీచందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మక్తల్ సభలో పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు ఇప్పటి ఎన్నికలకు చాలా తేడా ఉందన్నారు. తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో ఎంపిలను గెలిపించుకుని రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవాలంటే ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రావాలని షాద్‌నగర్ సభలో రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో సీఎం మాట్లాడుతూ.. మోడీ పాలమూరు జిల్లాకు వచ్చి.. వారు ఏమి చేశారో చెప్పకుండా డికె అరుణను గెలిపించాలని కోరడం విచిత్రంగా ఉందన్నారు. అరుణను గెలిపిస్తే బంగ్లాకే పరిమితం అవుతారని, వంశీ చందర్‌రెడ్డిని ఢిల్లీకి పంపిస్తే మనకోసం సైనికుల్లా పోరాడి మన ప్రాంత అభివృద్ధికి పాటుపడతాడని అన్నారు. బిజెపి హైదరాబాద్‌లో మత కల్లోలాలు సృష్టించి శాంతి భద్రతలను భగ్నం చేసే కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. బిజెపి కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జెపి దర్గా సాక్షిగా.. షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల సాక్షిగా ఆగస్టు 15వ తేదీలోపు రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. కెసిఆర్ కారు షెడ్డుకుపోయిందని భ్రమలో ఉన్నారని, నిజానికి కారు షెడ్డుకుగానీ రిపేరుకుగానీ పోలేదని ఏకంగా తూకానికే పోయిందని ఎద్దేవా చేశారు. అందుకే కెసిఆర్ రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేశారని విమర్శించారు. షాద్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి తాను అండగా ఉంటానని, రోడ్లు, కాలేజీలు, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని, షాద్‌నగర్ వరకు మెట్రోను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీలు వెంకట్ రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి, ఎంపీపీ ప్రియాంక, కాశినాథ్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, మామిడి శ్యామ్ సుందర్‌రెడ్డి, విశ్వం, బాబర్ ఖాన్, రఘు, జమృత్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌ెండ్డి, ఖదీర్, అందే మోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజు, ఈశ్వర్ నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

తుంగెడలో 'పోడు' కొట్లాట

- అటవీ అధికారులకు స్వల్ప గాయాలు
- పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురంభీం -ఆసిఫాబాద్ మండలం తుంగెడ గ్రామంలో శుక్రవారం అటవీ అధికారులు, గ్రామస్తుల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనలో అటవీ అధికారులు గాయపడ్డారు. తుంగెడ గ్రామ సమీపంలో గతంలో అటవీ అధికారులు ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. దీనికి ఆనుకొని ఉన్న ఆరు హెక్టార్ల భూమి తమదేనని, పూర్వీకుల నుంచి ఈ భూమి ఉందని, దానికి సంబంధించిన పట్టాలు ఉన్నాయని గ్రామానికి చెందిన కొంతమంది సాగు చేయడానికి గతేడాది ప్రయత్నం చేశారు. ఆ సమయంలో తహశీల్దార్ సాయంతో అటవీ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. రైతుల వద్ద ఉన్న పట్టాలు సరైనవి కావని, నిర్ధారణ కావడానికి జాయింట్ సర్వే చేయాల్సి ఉంటుందని అప్పటి తహసీల్దార్ చెప్పడంతో రైతులు సద్దుమణిగారు. నెల రోజుల కిందట రైతులు భూమిలో సాగు చేసే ప్రయత్నం చేయడంతో పంచాయితీ ప్రారంభమైంది. అటవీ అధికారులు అక్కడే టెంటు వేసుకుని వారిని అడ్డుకున్నారు. అప్పటి నుంచి గ్రామస్తులు పోడుకు ప్రయత్నించడం.. అధికారులు వారిని నిలువరించడం జరుగుతూ వస్తోంది. మూడ్రోజుల నుంచి అటవీ సిబ్బంది పెద్ద మొత్తంలో అదే భూమి వద్ద పహారా నిర్వహిస్తుండగా శుక్రవారం గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు, గ్రామస్తులకు తోపులాట జరగడంతో ఐదుగురు అధికారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన నేపథ్యంలో పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. అటవీ అధికారులు పది మంది గ్రామస్తులపై ఫిర్యాదు చేయగా, గ్రామస్తులు బీట్ అధికారిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదులో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

ప్రజలకు మంచి చేసే అడవిని అటవీ అధికారులు కాపాడటానికి ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ సూచనల మేరకే పని చేయాల్సి ఉంటుంది. అలాంటి అధికారులపై ప్రజలు దాడి చేయడం సరైంది కాదు. తుంగెడ పోడు సాగుదారులకు సంబంధించి జాయింట్ సర్వే నిర్వహిస్తున్నాం. గతంలో నిర్వహించిన సర్వేలో రైతులకు ఉన్న పట్టాలు సరైనవి కావని రెవెన్యూ అధికరారులు తేల్చేశారు. అయినప్పటికీ రైతుల కోరిక మేరకు జాయింట్ సర్వే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

మటన్, మంగళసూత్రాలే మీ ప్రచార అస్త్రాలా?

- అభివృద్ధి గురించి మీరెందుకు మాట్లాడరు?
- కాంగ్రెస్‌ను విమర్శించడం ద్వారానే ఓట్లు అడుగుతున్నారు
- టెంపోల్లో డబ్బు తరలిస్తుంటే, బిజెపి ప్రభుత్వం ఏం చేస్తోంది
- తెలంగాణకు ఏమిచ్చారో మోడీ చెప్పాలి
- ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

విలేకర్లతో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్లలో బిజెపి ప్రభుత్వం దేశానికి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పకుండా మొఘలుల మటన్, హిందువుల మంగళసూత్రాలు, ముస్లిం రిజర్వేషన్లనే ప్రచార అస్త్రాలుగా ఎంచుకుందని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీ దేశాన్ని అభివృద్ధి చేయకపోవడంతో దాన్నించి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చేసిన పనులను చెప్పి ఓట్లు అడిగే ధైర్యంలేని మోడీ...కాంగ్రెస్‌ను విమర్శించడం ద్వారా ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ వాళ్లు టెంపోల్లో డబ్బులు పంచుతున్నారంటూ ఆయన మరో అబద్ధపు ప్రచారాన్ని తెరపైకి తెచ్చారనీ, డబ్బు తరలిస్తుంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలేం చేస్తున్నాయని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జీ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎఐసిసి నేతలు నాసర్ హుస్సేన్, మన్సూర్ అలీ, రాష్ట్ర నాయకులు మధుయాష్కీగౌడ్, జె గీతారెడ్డి, ప్రోటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్, మీడియా కమిటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఖర్గే విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణకు వచ్చిన ప్రధాని మోడీ ఈ రాష్ట్రానికి పెద్ద ప్రాజెక్టు ఏమి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలమేరకు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 'బిజెపి మాత్రం అభివృద్ధి గురించి చెప్పి ఓట్లు అడగదు. కాంగ్రెస్‌పై నిందలు మోపడం ద్వారా ఆ పార్టీ నేతలు ఓట్లు అడుగుతారు. హస్తం పార్టీ తమకు పోటీయే కాదంటూనే పదేపదే బిజెపి మాపై విమర్శలు చేస్తున్నది. మా పార్టీకి భయపడుతున్నందునే పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. నల్లధనం వెలికితీస్తామని ఎన్నో ప్రగల్భాలు పలికారు. దాని ప్రయోజనాలను వారి మిత్రులకే అందజేశారు' అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధనవంతుల ఆస్తులు లాక్కుని పేదలకు పంచుతారంటూ మోడీ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందన్న విషయాన్ని ప్రధాని గుర్తించాలని ఆయన కోరారు. దేశాభివృద్ధిని మోడీ గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతీ పేద మహిళకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తామని పునరుద్ఘాటించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రావడంతోనే రైతుల పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రాష్ట్రంలో మిగతా పథకాలన్నింటినీ అమలు చేస్తామని వాగ్దానం చేశారు. ఇప్పటికైనా బిజెపి నేతలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోపై మాట్లాడాలని సవాల్ విసిరారు. ఇందిరాగాంధీ భూ సంస్కరణలు చేపట్టారనీ, బ్యాంకులను జాతీయం చేశారని తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసి, తదనుగుణంగా రిజర్వేషన్లను నిర్ణయిస్తామన్నారు. ఐఎఎస్, ఐపిఎస్,ఐఎఫ్ఎస్‌ల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు చాలా తక్కువగా ఉన్నారంటూ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం హైదారాబాద్‌ను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. హైదారాబాద్, బెంగళూరు, ముంబాయికి రావాల్సిన పెట్టుబడిదారులను బెదిరించి గుజరాత్ రాష్ట్రానికి తరలించారని ఈ సందర్భంగా ఖర్గే ఆరోపించారు. 'పువ్వులు పొద్దున పూస్తాయి. సాయంత్రం అవి వాడిపోతాయి. చెయ్యి ఎప్పుడు మీతోనే ఉంటుంది. మోడీ చెప్పే అబద్ధాలను నమ్మి ఓట్లు వేస్తే మోసపోతారు' అని హెచ్చరించారు. ఎంపి ప్రజ్వల్ రేవన్నపై కర్ణాటక ప్రభుత్వం సిట్ బృందాన్ని ఏర్పాటు చేసిందనీ ఆ నివేదిక రాగానే ఆయనపై చర్యలు తీసుకుంటుందని వివరించారు. తన అల్లుడిపై వచ్చిన రూ. 500 కోట్ల ఆరోపణలపై స్పందిస్తూ విచారణ జరిపించి దోషిగా తెలితే శిక్ష వేయాలని సూచించారు.

నేడు టిఎస్ఆర్ జెసి పరీక్ష ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నడుపుతున్న 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం గతనెల 21న నిర్వహించిన టిఎస్ఆర్‌జెసి సెట్ రాతపరీక్ష ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిఎస్ఆర్‌జెసి ప్రవేశ పరీక్ష మార్కులు శనివారం http://tsrjdc.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్ నెంబర్ నమోదు చేసి మార్కులను తెలుసుకోవాలని సూచించారు. మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ఎంపికైన విద్యార్థులకు సమాచారం రెండు, మూడు రోజుల్లో తెలియజేస్తామని వివరించారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియంలో ఎంపిసి, బైపిసి, ఎంఇసిలో 35 జూనియర్ కాలేజీల్లో ప్రవేశం కోసం పదో తరగతి పరీక్షలకు హాజరైన రాష్ట్రంలోని 73,527 మంది విద్యార్థులు దరఖాస్తు చేసిన విషయం చేసిన విషయం తెలిసిందే. వారిలో గతనెల 21న రాతపరీక్షకు 61,442 (84 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు.

HDFC BANK
We understand your world

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్ (వెస్ట్), ముంబై, మహారాష్ట్ర-400013
బ్రాంచ్ ఆఫీస్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, ఇ.నెం.6-3-246 మరియు 6-3-244/ఏ, 3వ అంతస్తు, రోక్సానా పల్లాడియం, రోడ్ నెం.1, బంజారా హిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034

Ref No: HDFC/4536191/SARFA తేదీ:28-03-2024

టు,
1) శ్రీ రమేష్ వర్ధం, తండ్రి వర్ధం పర్వతాలు, ఇ.నెం.7-46, సాయి నగర్ కాలనీ, అచ్చంపేట్ గ్రామం & మండలం, నాగర్ కర్నూల్-509376.
అలాగే నివాసం: ఇ.నెం.4-32, సింగవరం పెనిమిళ్ల గ్రామం, అచ్చంపేట్ మండలం, నాగర్ కర్నూల్-509376. ....(దరఖాస్తుదారు)
2) శ్రీ.వర్ధం రాజేంద్ర, తండ్రి వర్ధం పర్వతాలు, ఇ.నెం.6-111/11, ప్లాట్ నెం.17 & 18, లక్ష్మీ ఎన్‌క్లేవ్, ఎన్ఆర్ రాఘవేంద్ర మఠం, జిల్లెల్‌గూడ, బాలాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లా. 500032. అలాగే నివాసం: ఇ.నెం.1-6, సింగవరం గ్రామం, అచ్చంపేట్ మండలం, నాగర్ కర్నూల్-509375. ....(సహ దరఖాస్తుదారు)
3) శ్రీమతి వర్ధం నారమ్మ, భర్త వర్ధం పర్వతాలు, ఇ.నెం.1-6, సింగవరం గ్రామం, అచ్చంపేట్ మండలం, నాగర్ కర్నూల్-509375. ....(సహ దరఖాస్తుదారు)
4) శ్రీ తిరుపతయ్య బొడ్డుపల్లి, తండ్రి పెద్ద బాలయ్య, ఇ.నెం.1-54, సింగవరం గ్రామం, అచ్చంపేట్ మండలం, నాగర్ కర్నూల్-509376 ....(హామీదారు)
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట 'చట్టం'గా పేర్కొనబడను)లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన.
డియర్ సర్/ మేడం,
దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట 'చట్టం'గా పేర్కొనబడను)లోని నిబంధనల పరంగా బ్యాంక్ ద్వారా అధీకృత అధికారిగా నియమింపబడ్డాడు, దీని ద్వారా మీకు ఈ క్రింది నోటీసును జారీ చేస్తారు: చిరునామాదారులు నెం.1, 2, 3 &4 వారి అభ్యర్థన మేరకు మా కిసాన్ గోల్డ్ కార్డ్ స్కీమ్ కింద రూ.19,00,000/- (రూపాయలు పందొమ్మిది లక్షలు మాత్రమే) కోసం ఆర్థిక సహాయం అందించబడింది, వాటిని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, దీని రిజిష్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్ (వెస్ట్) ముంబై 400013 వద్ద కలిగియుండి, దాని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, పేట్‌బషీర్‌బాద్, 04-089/జి/ఏ/బి/1ఏ, దివాన్ దాబా ఎదురుగా, సోము రెసిడెన్సీ, ఎన్‌హెచ్-7, పేట్‌బషీర్‌బాద్, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500055, తెలంగాణ ద్వారా మంజూరుచేసిన షెడ్యూల్ ఆస్తిలోని పేర్కొన్న ఆస్తిపై ఇవ్వబడినది అది దిగువ పట్టికలో ఇవ్వబడినది

రుణ నెం.	ప్రొడక్ట్	పంపిణీ తేదీ	రుణ మొత్తం	జప్తు మొత్తం	జప్తు తేదీ
50200028071863	రిటైల్ అగ్రి క్యాష్ క్రెడిట్	29-11-2017	Rs.12,00,000/-	Rs.14,93,840.94	26-03-2024
50200028065669	ఫామ్ డెవలప్‌మెంట్ రుణం-డిఓడి	29-11-2017	Rs.7,00,000/-	Rs.91,571.47	26-03-2024
		పూర్తి మొత్తం	Rs.19,00,000/-	Rs.15,85,412.41	

మీ చిరునామాదారులందరూ ఆమోదించిన మరియు సంతకం చేసిన రుణ ఒప్పందాల మంజూరు లేఖ మరియు షెడ్యూల్‌లో పేర్కొన్న నిబంధనలు మరియు షరతుల ప్రకారం రుణం తిరిగిచెల్లించబడుతుంది. చిరునామాదారులు పొందిన సదరు రుణాన్ని తిరిగిచెల్లించుటకు సెక్యూరిటిగాను హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వారిపేరున ఈ నోటీసు యొక్క షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తిని చిరునామాదారు నెం.3 వారు తనఖాపెట్టినారు.
షెడ్యూల్ ఆస్తికి సంబంధించి రుణ ఒప్పందాలతోకలిపి వివిధ పత్రాలను మీరందరూ నిర్వహించిన తరువాతనే ఆఫర్ లేఖ ప్రకారం రుణం నియమ నిబంధనలు ఆమోదించబడ్డాయి. డెబిటెడ్ వాయిదాలు/ వడ్డీని తిరిగిచెల్లించని కారణంగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీచేసిన గైడ్‌లైన్స్ ప్రకారం 01.10.2020న మీరు ఖాతా నాన్-పర్ఫార్మింగ్ అసెట్‌గా వర్గీకరించబడింది. రుణాన్ని తిరిగిచెల్లింపు చేయుటకు అనేక పర్యాయాలు గుర్తుచేసినప్పటికీ మీరు బకాయిలను చెల్లించుటలో విఫలం చెందినారు.
ఈ పరిస్థితుల్లో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) నియమాలను అనుసరించి మీకు మంజూరైన రుణాన్ని రీకాల్ చేయుటకు బ్యాంకు నిర్ణయించింది.
కావున, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, ఇందుమూలంగా ఈ నోటీసు తేది నుండి 60రోజుల్లోపు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వారికి దిగువ పేర్కొన్న మీ పూర్తి బకాయిలను చెల్లించుటకు ఈనోటీసు జారీచేస్తూ సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీ దృష్టికి తీసుకురావడమైనది. మీరు బాకిపడన మొత్తం 26.03.2024 నాటికి వడ్డీతోకలిపి రూ.15,85,412.41 (రూపాయలు పదిహేను లక్షల ఎనభైఐదువేల నాలుగువందల పన్నెండు& నలభైఒక పైసలు మాత్రమే), దీనితోపాటుగా ఇన్సిడెంటల్ వ్యయాలతోకలిపి పై మొత్తాలను తదుపరి వడ్డీని కాంట్రాక్చువల్ రేటుతో చెల్లించుటకు మీరందరూ భాధ్యులు.
చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసు నియమాలను అనుసరించి పై పేర్కొన్న తదుపరి వడ్డీ& ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులతో సదరు మొత్తం రూ.15,85,412.41 (రూపాయలు పదిహేను లక్షల ఎనభైఐదువేల నాలుగువందల పన్నెండు& నలభైఒక పైసలు మాత్రమే)లను హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వారిమీరు చెల్లించుటలో విఫలంమైతే, సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు ఇతర వర్తించు ప్రొవిజన్స్ క్రింద అన్ని లేదా ఏదేని హక్కును హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వినియోగిస్తుంది.
చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ నియమాలను అనుసరించి మీ దృష్టాకి తీసుకురాడమేమనగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వారి వ్రాతపూర్వక అనుమతి లేకుండా దిగువ వివరించిన సెక్యూర్డు అసెట్‌ను అమ్మకం, లీజు లేదా ఇతరత్రా విధానంచే బదిలీ నుండి మీరు నిషేధించబడినారు. ప్రస్తుతానికి అమలులో ఉన్న ఏదైనా ఇతర చట్టంలోని నిబంధనల ప్రకారం లేదా ఇప్పటికే కొనసాగించడానికి తగినట్లుగా మరియు అవసరమైనట్లుగా భావించే ఏదైనా ఇతర చట్టపరమైన చర్యలు/చర్యను ప్రారంభించడానికి సురక్షితమైన రుణదాతకు అందుబాటులో ఉన్న ఇతర చట్టపరమైన హక్కు /నివారణలకు పక్షపాతం లేకుండా నోటీసు జారీ చేయబడింది. సాధారణ కోర్సులో చట్టపరమైన చర్యలను ప్రారంభించింది. పేర్కొన్న చట్టం కింద అందించబడిన ఈ చట్టబద్ధమైన నిషేధం/నిగ్రహం యొక్క ఏదైనా ఉల్లంఘన నేరం అని కూడా మీరు నోటీసులో ఉంచబడ్డారు.
మీరు సురక్షిత రుణాన్ని చెల్లించని పక్షంలో, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ద్వారా అమలు చేయడానికి ఉద్దేశించిన సెక్యూర్డు అసెట్ వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

ఆస్తి యొక్క షెడ్యూలు:
ఆస్తి యజమాని: వర్ధం నారమ్మ, సాయినగర్, అచ్చంపేట్ టౌన్ & మండలం, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోగల ఆర్‌సిసి స్ట్రక్చర్‌లో గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే కలిగిన 121 చ.గ.లు లేదా 101.17చ.మీ.ల విస్తీర్ణంలో సర్వే నెం.108లోని ప్లాట్ నెం.21పై నివాసిత ఇంటి నెం.7-46 మొత్తం భాగం. ఆస్తి సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.22, దక్షిణం: ప్లాట్ నెం.18, తూర్పు: రోడ్డు, పడమర: ప్లాట్ నెం.20
దయచేసి ఈ నోటీసు కింద ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ఉండండి మరియు అన్ని అసహ్యకరమైన విషయాలను నివారించండి. పాటించని పక్షంలో అన్ని ఖర్చులు మరియు పర్యవసానాలకు మిమ్మల్ని బాధ్యులుగా చేస్తూ తదుపరి అవసరమైన చర్య తీసుకోబడుతుంది.

తేది: 10-05-2024
అధీకృత అధికారి,
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరపున

లేదంటూనే మూడు రాష్ట్రాల్లో కోచ్ ఫ్యాక్టరీలు

- కాజీపేటకు మోడీ మొండిచేయి
- చిరకాల కాంక్షను చిదిమేసిన బిజెపి
- వ్యాగన్‌తో చేతులు దులుపుకున్న కేంద్ర సర్కార్
- వరంగల్ సభలో పెదవి విప్పని ప్రధాని మోడీ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

దేశంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని 2016లో ఆనాటి కేంద్ర రైల్వే సహాయ మంత్రి మనోజ్‌సింగ్.. ప్రకటన చేసిన అనంతరం మహారాష్ట్ర, గుజరాత్, అసోం రాష్ట్రాల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను మంజూరు చేయడం గమనార్హం. రాష్ట్రంలో మాత్రం విభజన చట్టంలోని హామీలను ఉల్లంఘించి మరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు వ్యాగన్ కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చి మోడీ చేతులు దులుపుకున్నారు. 44 ఏళ్ల కాజీపేట చిరకాల స్వప్నాన్ని బిజెపి ప్రభుత్వం చిదిమేసింది. ప్రధాని మోడీ గుజరాత్‌లో రూ.20 వేల కోట్లతో ఎలక్ట్రిక్ లోకోమోటివ్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకొని, కాజీపేటలో మాత్రం రూ.521 కోట్లతో వ్యాగన్ తయారీ కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్‌పై వర్ణ వివక్ష ఆరోపణలు చేసిన మోడీ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై పెదవి విప్పలేదు. అయితే నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి మాత్రం రాష్ట్రపతి ముర్మును ఆహ్వానించలేదు. కాగా, కష్టకాలంలో బిజెపికి వరంగల్ ప్రజలు వెన్నంటి ఉన్నారని చెప్పిన ప్రధాని.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రస్తావించకపోవడం ఉమ్మడి వరంగల్ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. 44 ఏళ్లుగా ఎన్నో ఉద్యమాలు, రాజకీయాలకతీతంగా జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి పోరాటాలు జరిగాయి. రైల్వే కార్మిక సంఘాలు సైతం జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఆందోళనలను నిర్వహించాయి. అలాంటి సుదీర్ఘ పోరాటాన్ని కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, మోడీ సర్కార్ నిర్వీర్యం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటులో అమోదించిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన కీలక హామీల్లో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీతో పాటు బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, ఐటిఐఆర్ ఏర్పాటు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాజీపేట రైల్వే జంక్షన్ ఉత్తర, దక్షిణ భారత దేశాన్ని కలిపే రైల్వే వారధిగా ఉంది. ఈ ప్రాంతంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే పెద్ద సంఖ్యలో తెలంగాణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంతోకాలంగా యువకులు ఆశతో ఎదురు చూశారు.ఆ తర్వాత మోడీ అధికారంలోకి రాగా పార్లమెంటులో ఎన్నో సందర్భాల్లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయం ప్రస్తావించినా, దేశంలో కోచ్ ఫ్యాక్టరీల ఏర్పాటు అవసరం లేదని 2016లో నాటి రైల్వే సహాయ మంత్రి మనోజ్ ప్రకటన చేశారు. ఆ ప్రకటన అనంతరం మహారాష్ట్రలోని లాతూరు, గుజరాత్‌లోని దహోడ, అస్సాంలోని కొకర్‌జహార్‌లలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను మంజూరు చేశారు. దీనిపై తెలంగాణ ప్రజలు ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

కాజీపేటకు మోడీ మొండిచేయి..

పార్లమెంటులోనే ఎన్‌డిఎ ప్రభుత్వం కోచ్ ఫ్యాక్టరీలు అవసరం లేదని ప్రకటన చేసి కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్‌ను అటకెక్కించి మహారాష్ట్ర, గుజరాత్, అసోంలో ఏర్పాటు చేయడాన్ని ఏమనాలో బిజెపి నేతలు చెప్పాల్సి ఉంది. ఇదిలావుంటే కాజీపేటలో అవసరం లేని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మూడు రాష్ట్రాల్లో ఎలా ఏర్పాటు చేశారో మరీ ఎన్‌డిఎ పాలకులు తెలంగాణ ప్రజలకు వివరించాల్సిన అవసరముంది. దీనిపై తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రాంతం పట్ల, ముఖ్యంగా కాజీపేట రైల్వే అభివృద్ధి పట్ల మోడీ ప్రభుత్వం వివక్ష చూపిందన్న భావనలో స్థానికులున్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని మోడీ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై పెదవి విప్పలేదు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ బిజెపి అభ్యర్థి అరూరి రమేష్ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినా, ప్రధాని స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రధాని మోదీ కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకుండా తన సొంత రాష్ట్రంలో 2022 ఏప్రిల్‌లో రూ. 20 వేల కోట్లతో ఎలక్ట్రిక్ లోకో మోటివ్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం వివక్ష కాకపోతే మరేమనాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రశ్నించారు. ఎన్‌డిఎ పాలకులకు తెలంగాణ ప్రజలు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు.

ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలి

- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌యుటిఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న చావ రవి

ఎన్‌సిటిఇ ఇచ్చిన వివరణ, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు మేరకు టెట్‌పై అడ్డంకులు తొలగినందున ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొర్రూర్‌లో సంఘం నాయకులు ఎ మురళీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన టిఎస్ యుటిఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టెట్‌పై ఎన్‌సిటిఇ ఇచ్చిన వివరణ, టెట్‌తో నిమిత్తం లేకుండా ఎస్‌జిటిలు, పండిట్‌లు, స్కూల్ అసిస్టెంట్లలకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులతో ఉపాధ్యాయుల్లో నెలకొన్న సందిగ్ధత తొలగిందని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికలు ముగియగానే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను తీవ్ర గందరగోళానికి గురి చేసిన టెట్ అంశాన్ని పరిష్కరించకుండా నిర్లిప్తంగా వ్యవహరించిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అక్టోబర్‌లో బదిలీ అయి రిలీవ్ చేయని ఉపాధ్యాయులను పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే రిలీవ్ చేయాలని, మల్టీ జోన్-2లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. బకాయి ఉన్న నాలుగు వాయిదాల డిఎను విడుదల చేయాలని, ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 317 బాధితులకు న్యాయం చేయాలని, మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖ పరిధిలోకి తీసుకుని 010 హెడ్ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని, విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికే పాఠశాలల్లో విద్యావాలంటీర్లను, పారిశుధ్య కార్మికులను నియమించాలని, ఉచిత విద్యుత్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ స్వప్న, జిల్లా కోశాధికారి కె నాగమల్లయ్య, కార్యదర్శులు ఎ వెంకన్న, డి హుస్సేన్, ఎన్ జనార్ధన చారి, కె బిక్షపతి, పి మంజుల, ఎం మంజుల, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి, కాంగ్రెస్‌ల దొంగ మాటలు నమ్మి మోసపోవద్దు

- సిఎం రేవంత్ రెడ్డివి జూటా మాటలు
- వినోదన్నను గెలిపిస్తే పార్లమెంట్‌లో గళమెత్తే గొంతవుతాడు
- తెలంగాణను ఆంధ్రాలో కలిపే కుట్ర చేస్తున్న చంద్రబాబు, రేవంత్
- ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రచారంలో మాట్లాడుతన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మార్పు తెస్తామంటే ప్రజలు నమ్మి ఆగమయ్యారని, మరోసారి బిజెపి, కాంగ్రెస్‌ల దొంగ మాటలు నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో చేపట్టిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెడుతుందన్నారు. కెసిఆర్ కిట్, కల్యాణలక్ష్మి బంద్ అయ్యాయని, ఇస్తామన్న తులం బంగారానికి ఎగనామం పెట్టారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 24 గంటల కరెంటు వచ్చేదని, కాంగ్రెస్ వచ్చాక కరెంటు కోతలతో మోటార్లు కాలుతున్నాయని ఆరోపించారు. ఊర్లలో సాగునీరు, తాగునీటికి కష్టాలు వచ్చాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో సిమెంట్, స్టీల్‌తో పాటు నిత్యావసర ధరలూ పెరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ వంద రూపాయల బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయని, ఇప్పుడు మళ్లీ సిఎం రేవంత్ రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసుడు మొదలుపెట్టాడని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. నూట యాభై రోజులైనా అమలు చేయకుండా చేతులెత్తేశారని విమర్శించారు. డిసెంబర్ తొమ్మిన రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ మాట మార్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడగటానికి వస్తే.. మహాలక్ష్మి కింద ఇస్తామన్న రూ.2500, రూ.4000ల పెన్షన్ ఇచ్చాకనే ఓట్లు అడగటానికి రావాలని చెప్పాలని ప్రజలకు సూచించారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తుందన్నారు. తప్పిపోయి మళ్లీ కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే దొంగలకు సద్దికట్టినట్లు అవుతుందన్నారు. ఆంధ్రాలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి కలిసి మళ్లీ తెలంగాణను ఆంధ్రాలో కలిపే కుట్ర చేస్తున్నారన్నారు. నదుల అనుసంధానం పేరుతో కేంద్రం ప్రభుత్వం కుట్ర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు అన్ని వర్గాలను మోసం చేసిందని, వినోదన్నను గెలిపిస్తే పార్లమెంట్‌లో గళమెత్తే గొంతవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, పట్టణ అధ్యక్షులు అన్వర్, మండల అధ్యక్షులు గంగం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

విద్యుద్ఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో శుక్రవారం జరిగింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. పొట్రూ శ్రీను (50) తనకున్న పొలంలో పశువుల మేత కోసమని జాడు విత్తనాలు చల్లారు. దానికి నీరు పెట్టేందుకు విద్యుత్ మోటార్‌కు ఉన్న సర్వీస్ వైరును పట్టుకొని పైకి లేపి కట్టే సమయంలో వైరు తెగి ఉండటంతో చేతికి షాక్ కొట్టింది. దాంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బిఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌కు బెయిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయం మెస్‌ల మూసివేతపై దుష్ప్రచారం చేసిన కేసులో అరెస్టయిన బిఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం విచారణ చేపట్టిన కోర్టు.. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలు, రెండు షూరిటీలు సమర్పించాలని, ప్రతిరోజూ పోలీసుల ముందు హాజరు కావాలని క్రిశాంక్‌ను కోర్టు ఆదేశించింది.

ప్రయివేటు ఆస్పత్రిలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మగశిశువుకు జన్మనిచ్చి బాలింత మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. కాగా వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే బాలింత మృతిచెందినట్టు కుటుంబీకులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద నున్న ఒక ప్రయివేటు ఆస్పత్రిలో ఆలూరు మండలం కల్లెడ గ్రామానికి చెందిన గర్భిణి పిట్ల సుమలతకు సిజేరియన్ చేయగా మగ శిశువుకు జన్మనిచ్చింది. ఉమ్మినీరు మింగడంతో బాబును పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లి వచ్చేసరికి బాలింత మృతిచెందింది. ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వహించారని, మత్తు మందు వికటించి మృతిచెందినట్టు కుటుంబీకులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైటాయించారు. సమాచారం అందుకున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట పోలీసులు మోహరించారు. మృతురాలి భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళలకు ప్రతిష్టాత్మకం 'చునావ్'

- లోక్‌సభ బరిలో ఆరుగురు
- కొత్తవారితోపాటు సీనియర్ల పోటీ
- ఇప్పటివరకు రాష్ట్రం నుంచి పార్లమెంటుకు ఇద్దరే
- ఈసారి ఎందరో ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాజా పార్లమెంటు ఎన్నికలు మహిళలకు ప్రతిష్టాత్మకం కానున్నాయి. దేశంతోపాటు రాష్ట్రంలోనూ 18వ లోక్‌సభ ఎన్నికల బరి విపరీతంగా క్రేజ్ కలిగిఉంది. ప్రపంచమంతా భారత ఎన్నికలవైపు చూస్తున్న క్రమంలో తెలంగాణ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ఆరుగురు మహిళలు రంగంలో ఉండటం గమనార్హం. రాష్ట్రంలో నాలుగో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఇతర అభ్యర్థులు ఉన్నా, ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తుండటంతో రాజకీయ విశ్లేషకుల దృష్టి వీరిపై పడింది. వీరిలో ముగ్గురు రాజకీయాలకు కొత్త కాకపోయినా, లోక్‌సభకు పోటీచేయడం మొదటిసారి కావడం తెలిసిందే. మూడు ప్రధాన పార్టీల నుంచి పార్లమెంటుకు మహిళా అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. పురుష అభ్యర్థులతో సమానంగా చెమటోడుస్తున్నారు, తాము కచ్చితంగా గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. వీరంతా కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి నుంచి పోటీ చేస్తూ ఎన్నికల్లో తమ సత్తా చాటే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం 17 స్థానాలకు 525 మంది బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీల నుంచి పోటీచేస్తున్నవారిలో ఆరుగురు మహిళలు కావడం తెలిసిందే. కాంగ్రెస్ నుంచి ముగ్గురు, బిఆర్‌ఎస్ ఒక్కరు, బిజెపి నుంచి ఇద్దరు పోటీలో ఉన్నారు.

వీరే..ఆ ఆరుగురు

మల్కాజ్‌గిరి నుంచి వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునితా మహేందర్‌రెడ్డి ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరి టికెట్ సాధించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సిట్టింగ్ సీటు అయిన మల్కాజ్‌గిరి నుంచి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి భార్య అయిన సునితారెడ్డిని నిలబెట్టారు. అలాగే వరంగల్ నుంచి మాజీ మంత్రి కడియం శ్రీహరి కూతరు డాక్టర్ కె కావ్య వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్నారు. తను కూడా మందు బిఆర్‌ఎస్ టికెట్ తీసుకుని అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఆదిలాబాద్‌లో ఆత్రం సుగుణమ్మ పోటీలో ఉన్నారు. బిఆర్‌ఎస్ నుంచి మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపి మాలోతు కవిత మరోసారి పోటీచేస్తున్నారు. విజయం సాధిస్తాననే నమ్మకంతో ఉన్నారు. ఇక బిజెపి నుంచి మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ రంగంలో ఉన్నారు. గెలుపు బావుటా ఎగరేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి కొంపెల్లి మాధవీలతను బరిలోకి దించారు. ఆయా పార్టీల నుంచి పోటీచేస్తున్న ఆరుగురు అభ్యర్థులు ప్రచారంలో పోటీపడుతున్నారు. మహిళలను ఆకర్షించేలా ప్రచారం చేస్తున్నారు.

ఇప్పటివరకు ఇద్దరే

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలు లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆ ఇద్దరు బిఆర్‌ఎస్‌కు చెందిన వారే కావడం గమనార్హం. 2014లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఒకరు కాగా, మహబూబాబాద్ నుంచి విజయం సాధించిన మాజీ మంత్రి రెడ్యానాయక్ కూతురు మాలోతు కవిత మరోకరు. వచ్చే 13వ తేదీ సోమవారం జరిగే ఎన్నికల్లో ఎంత మంది మహిళా అభ్యర్థులు పార్లమెంటుకు వెళతారో జూన్ మూడున తేలనుంది. అంతవరకు వేచిచూడాల్సిందే.

వీరంతా గెలిచేనా ?

- ఓడిన ఎమ్మెల్యేలు లోక్‌సభ బరిలో
- ఈటల, ఆర్‌ఎస్, రఘునందన్, కొప్పుల బాజీరెడ్డిపై చర్చోపచర్చలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని అందరూ అంటుంటారు. అందులోనూ గెలుపోటములు సహజమేనని సెలవిస్తుంటారు. ఇదంతా ఒక పార్శ్వమైతే, మరో పార్శ్వం కూడా ఉంది. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కొంత మంది మాజీ ఎమ్మెల్యేలు తమ అదృష్టాన్ని, అవకాశాన్ని మరోసారి పరీక్షించుకునే పనిలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు నేతలు మళ్లీ లోక్‌సభకు పోటీచేస్తున్నారు. మరికొందరు టికెట్లు దక్కక ఉసూరుమంటున్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. ఇప్పటికే భారత ఎన్నికల సంఘం ఏర్పాటన్నీ చేసింది. రాజకీయ పార్టీలు సైతం ఢీ అంటే ఢీ అంటున్నాయి. పోటాపోటీగా ఎన్నికల ప్రచారానికి దిగాయి. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు, చిన్నా చితకా పార్టీలు ఎన్నికల బరిలో ఉన్నాయి. బిజెపి, బిఆర్‌ఎస్ తదితర పార్టీల నుంచి ఓడిపోయిన వారంతా లోక్‌సభ ఎన్నికల్లో తమ భవితవ్యాన్ని మరోసారి తేల్చుకోనున్నారు. బిజెపికి చెందిన ఈటల రాజేందర్ హుజురాబాద్‌తోపాటు కామారెడ్డిలోనూ ఓటమిపాలయ్యారు. దీంతో ఆయన్ను సెటిలర్ల ఓట్లు ఎక్కువగా ఉన్న మల్కాజ్‌గిరి నుంచి బిజెపి బరిలోకి దింపింది. అలాగే దుబ్బాకలో గెలవలేకపోయిన రఘునందన్‌రావును ఆ పార్టీ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయిస్తున్నది. అలాగే బీఆర్‌ఎస్ నుంచి సైతం పలువురు అదే వరుసలో బరిలోకి దింపింది. ధర్మపురి నుంచి విజయం సాధించలేకపోయిన కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం కేసీఆర్ పోటీకి పెట్టారు. అలాగే నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ స్థానం నుంచి ఓడిపోయిన బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్ లోక్‌సభకు నిలబెట్టారు. అలాగే ఆపార్టీ నేత ఆత్రం సక్కుకు అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్ టికెట్ నిరాకరించారు. అదే కేసీఆర్ అభ్యర్థుల కొరత నేపథ్యంలో ఆత్రం సక్కును ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పోటీచేయిస్తున్నారు. ఇదిలావుండగా సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బిఎస్‌సి టికెట్‌పై పోటీచేసి ఓడిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బిఆర్‌ఎస్‌లో చేర్చుకుని నాగర్‌కర్నూల్ స్థానం కేటాయించారు. ఇలా చాలా మంది మాజీ ఎమ్మెల్యేలు ఎంపీ టికెట్ల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. కొందరికి అవకాశం రాగా, మరికొందరికి విధి వెక్కిరించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వీరంతా, పార్లమెంటుకు గెలుస్తారా ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ తరహా పోటీలపై దుబ్బాక ప్రచారం సందర్భంగా 'అసెంబ్లీలో చెల్లని రూపాయి..మెదక్ పార్లమెంటు'లో చెల్లుదా ? అంటూ మాజీ సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలు రఘునందన్‌రావును ఉద్దేశించి చేసిన సంగతి తెలిసిందే. అయితే ఎక్కువ స్థానాల్లో పోటీపెట్టింది మాత్రం బిఆర్‌ఎస్ పార్టీనే కావడం గమనార్హం.

'ఎన్‌డిఎస్‌ఎ'పై జస్టిస్ ఘోష్ అధ్యయనం

- సాంకేతిక అంశాలపై చర్చ
- నేడూ కొనసాగనున్న భేటీ
- కెసిఆర్, హరీష్‌కు త్వరలో నోటీసులు ?

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) ఇచ్చిన నివేదికపై న్యాయ విచారణ కమిషన్ అధ్యయనం కొనసాగుతోంది. జస్టిస్ పినాకిని చంద్రఘోష్ శుక్రవారం హైదరాబాద్‌లోని బిఆర్‌ఆర్‌కే భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో అధికారులతో భేటి రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. జలాశయాలు, ప్రాజెక్టులకు ఉన్న తేడాల గురించి అధికారులతో చర్చించినట్టు తెలిసింది. సాంకేతిక అంశాలు, అర్థంకాని పదాలకు సంబంధించి ఇటీవల నియమించిన ఇంటర్నల్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. వివరణ తీసుకున్నారు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి టెక్నికల్ అంశాలనూ జస్టిస్ ఘోష్ అడిగితెలుసుకున్నట్టు సమాచారం. ఇదిలావుండగా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి బాధ్యులను గుర్తించే కార్యక్రమం చురుగ్గా సాగుతున్నట్టు తెలిసింది. అధికారులతోపాటు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను సైతం విచారణకు పిలవనున్నారు. ఈ మేరకు కమిషన్ అంతర్గత వ్యవహారాలను వేగంగా చేపట్టేందుకు వీలుగా బాధ్యతలను విభజించినట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల తర్వాత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు నోటీసులు ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇథమిద్దంగా కచ్చితమైన తేదీలు ఖరారు కానప్పటికీ, ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించిన వారందరిని పిలిచి విచారించనున్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్‌కు జూన్ 31లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ నెలాఖరు వరకు మేడిగడ్డ,అన్నారం,సుందిళ్ల గురించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తారు. వినతులు, ఫిర్యాదులను పరిశీలిస్తారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టు సంస్థ బాధ్యులు, ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులను విచారణకు రమ్మనే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- ఇడి, సిబిఐ, ఐటి సంస్థలను బిజెపి నిర్వీర్యం చేసింది : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఎంపిలకు నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నిర్వహించిన మీట్ ది ప్రెస్‌కు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధారాలు, ఛార్జిషీట్, విచారణ లేకుండానే ప్రతిపక్ష నేతలు జైల్లో పెడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రులు, మంత్రుల స్థాయి పరిస్థితే ఇలా ఉంటే, సామాన్యులకు దిక్కెవరని ప్రశ్నించారు. విపక్షాలనే కాకుండా మీడియా సంస్థలు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, నిలదీసినా ఇడి, సిబిఐ, ఐటి సంస్థలను ఉసిగొల్పి బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రెస్‌మీట్ పెట్టి పరిస్థితి ఎలా ఉందో వివరించారని తెలిపారు. . బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం, వాక్స్వాతంత్ర్యం దెబ్బతిన్నాయని చెప్పారు. ఆర్థిక విధానాల్లోనూ మోడీ సర్కారు విఫలమైందన్నారు. 70 ఏళ్లల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం 40 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారనీ, కానీ వారు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా నల్లసాగుచట్టాలు తెచ్చారని అభిప్రాయపడ్డారు. కొన్ని నెలలపాటు రైతులు తీవ్రమైన ఆందోళన చేయడమేగాక, అనేక మంది రైతులు తమ ప్రాణాలను బలిదానం చేశాకే వాటిని రద్దుచేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా, భర్తీచేయకుండా బిజెపి నిరుద్యోగులకు అన్యాయం చేసిందని తెలిపారు. అగ్నివీర్ పథకం దేశ రక్షణకు ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. గతంలో ఏ ప్రధాని కూడా మోదీలా దిగజారి మాట్లాడలేదని అభిప్రాయపడ్డారు. పదేండ్లల్లో ఏం చేశారో చెప్పడం లేదనీ, మళ్లీ గెలిస్తే ఏం చేస్తారో కూడా చెప్పకుండా ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావాలని చూస్తున్నారని అన్నారు. మోడీ రాష్ట్రాలకు ఇచ్చిందేమీ లేదన్నారు. తెలంగాణ, ఎపి మధ్య బుల్లెట్ రైలు ఉండాలని కేంద్రాన్ని ఎన్నోసార్లు కోరినా మోడీ సర్కారు పట్టించుకోలేదని నిరసన తెలిపారు. బిజెపి నేతలకు తెలంగాణలో ఓట్లు అడిగే అర్హత కూడా లేదని వ్యాఖ్యానించారు.

పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడిద్దాం

- టాప్ర రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్నిసార్లు విన్నపాలు చేసినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదనీ, వాటిని చెత్తబుట్టలో వేసిందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ల అసోసియేషన్ (టాప్ర) రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణరెడ్డి అన్నారు. సమస్యలను పరిష్కరించని బిజెపిని పార్లమెంటు ఎన్నికల్లో ఓడిద్దామని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో టాప్ర రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద వృద్ధులకు కూడా నెలకు రూ.మూడు వేల ఆసరా పెన్షన్ వస్తున్నదని చెప్పారు. 20 నుంచి 30 ఏండ్లు ప్రభుత్వరంగ సంస్థలో పనిచేసిన ఉద్యోగి వేతనం నుంచి పీఎఫ్ రూపంలో కొంత మినహాయించుకుని నెలకు కనీసం రూ.వెయ్యి పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించారని అన్నారు. కానీ ఈ ఏడాది నుంచి దాన్ని మంజూరు చేయడమంటే కేంద్ర ప్రభుత్వం సాచివేత ధోరణిని అవలంభిస్తున్నదని విమర్శించారు. ఇపిఎస్ పెన్షనర్లకు కరువు భత్యంతో కూడిన కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు, సింగరేణి పెన్షనర్లకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పట్టించుకోని బిజెపికి వ్యతిరేకంగా ఓటేయాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీని ఓడించాలని కోరుతూ కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టాప్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం నరహరి, ఎం జనార్ధన్‌రెడ్డి, ఎల్ అరుణ, సెక్రెటరీ జనరల్స్ టి సీతారాం, కె నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, శంకర్‌రావు, జి అశోక్, కె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల జాతర

- ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే బస్సులు, రైళ్లు కిటకిట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో నివశించే ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్వగ్రామాలకు క్యూ కట్టారు. ఎపి అసెంబ్లీ ఎన్నికలు ఈసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారడంతో ఒక్క ఓటైనా వృధాకాకుండా ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రెండు రోజుల ముందు నుంచే ఓటర్లను తరలిస్తున్నారు. దీంతో శుక్రవారం నుంచే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో రద్దీ పెరిగింది. మహాత్మాగాంధీ బస్ స్టేషన్, సికాంద్రాబాద్ రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, గుంటూరు తదితర జిల్లాలకు వెళ్లే వారితో ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, సాగర్ రింగ్‌రోడ్డు బస్టాప్‌లల ప్రయాణికుల రద్దీ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టిఎస్‌ఆర్‌టిసి సుమారు రెండు వేల ప్రత్యేక బస్సులు నడుపుతోంది. రైల్వే శాఖ కూడా రెగ్యులర్ రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటుచేసింది.

రూ.3 లక్షల డ్రగ్స్ స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు నిందితులను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3 లక్షల 11.34 గ్రాముల కొకైన్, 3.66 జీఎంఎస్ డ్రగ్స్‌తోపాటు ద్విచక్రవాహనం, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డిసిపి రష్మి పెరుమాల్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన అబ్దుల్ సాయి శరత్, అబ్దుల్ శ్రావణ్ బేగంపేట్‌లో నివాసముంటున్నారు. 2019లో హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరూ బంజారాహిల్స్‌లో రెస్టారెంట్‌లు ప్రారంభించారు. వీరికి యూసుఫ్‌గూడలో నివాసముంటున్న శ్రీవాస్తవ్ రిషబ్ పరిచయమయ్యాడు. ముగ్గురూ మద్యానికి బానిసలుగా మారారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో డ్రగ్స్ సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ముంబయికి చెందిన డ్రగ్స్ సరఫరాదారునితో చేతులు కలిపారు. ముంబయి నుంచి కొరియర్ ద్వారా డ్రగ్స్‌ను తెప్పించుకుంటున్న నిందితులు.. నగరంలో కావాల్సిన వారికి, తెలిసిన వారికి సరఫరా చేస్తున్నారు. పోలీసులు గుర్తించకుండా ఎన్వలప్ కవర్‌లో డ్రగ్స్‌ను చేరవేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు నెక్లెస్ రోడ్డులోని జలవిహార్ వద్ద ప్రత్యేక నిఘా వేసి ముగ్గురిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ కోసం నిందితులను లేక్ పోలీస్‌లకు అప్పగించినట్టు డిసిపి తెలిపారు.